

మాజీ తహసీల్దార్ పెన్షన్‌లో మూడు శాతం కోత

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించి దరఖాస్తులను పరిశీలించకుండా తిరస్కరిస్తూ ఆదేశాలు జారీచేసిన మాజీ తహసీల్దార్ మోహనవల్లిపై గతంలో ఇచ్చిన పనిష్మెంట్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఆమెకు చెల్లించే పెన్షన్ మొత్తంలో ఏడాది పాటు 3శాతం కోత విధిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో తవణంపల్లె తహసీల్దార్‌గా పనిచేసిన మోహనవల్లి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్ టైటిల్ డీడ్, పట్టాదారు పాసుపుస్తకాల మ్యుటేషన్ కోసం అందిన 59 దరఖాస్తులను రెవిన్యూ రికార్డుల ద్వారా పరిశీలించకుండా తిరస్కరిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ తప్పిదాలను గుర్తించిన సీసీఎల్‌ఏ వారిద్దరిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. మేజర్ పనిష్మెంట్‌గా మోహనవల్లికి మూడు వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లు, డీటీ నరేష్‌కుమార్‌కు ఒక ఇంక్రిమెంట్ కోత విధించాలని ఈ ఏడాది జనవరిలో కలెక్టర్‌కు సిఫార్సు చేసింది. అయితే మోహనవల్లి ఈ ఏడాది ఫిబ్రవరి 28న రిటైరవడంతో ఆమెపై విధించిన పనిష్మెంట్‌ను ఏ విధంగా అప్లై చేయాలో కోరుతూ సీసీఎల్‌ఏకు కలెక్టర్ నివేదిక పంపారు. మరోవైపు తనపై విధించిన పనిష్మెంట్‌ను పునఃపరిశీలించాలని మోహనవల్లి కూడా సీసీఎల్‌ఏను కోరారు.ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం గతంలో ఆమెపై విధించిన మూడు వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్ కోతను సడలిస్తూ పింఛన్‌లో ఏడాది పాటు మూడుశాతం కోత విధిస్తూ ఆదేశాలు జారీచేసింది.

కాపురానికి రాలేదని భార్యపై యాసిడ్ పోశాడు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాపురానికి రాలేదనే కోపంతో భార్యపై భర్త యాసిడ్ పోసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. చిత్తూరు రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. రాంనగర్ కాలనీకి చెందిన భార్యాభర్తలు దావూద్, రేష్మా రెండు నెలల క్రితం మనస్పర్థలు రావడంతో విడిపోయారు. రేష్మ రాంనగర్ కాలనీలోని ఇంట్లో ఉంటుండగా.. సోమవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లి కాపురానికి రమ్మని దావూద్ కోరాడు. ఆమె నిరాకరించి తలుపు మూసుకుంది. తలుపు తీయమని గట్టిగా అరవడంతో ఆమె భయంతో తలుపు తీయగా, తన వెంట తెచ్చుకున్న బ్యాటరీల్లో వినియోగించే యాసిడ్‌ను ఆమె ముఖంపై పోశాడు. ఆమె గట్టిగా అరవడంతో దావూద్ పారిపోయాడు. ముఖంపై గాయాలు కావడంతో రేష్మను బంధువులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.దావూద్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీడీ సర్వేను పరిశీలిస్తున్న చిత్తూరు డీఎంహెచ్‌వో సుధారాణి



ప్రమాదంలో ప్రజారోగ్యం

గతి తప్పిన ఆహారపు అలవాట్లు......కొరవడిన శారీరక శ్రమ .....పెరుగుతోన్న మానసిక ఒత్తిడి..... చాపకింద నీరులా అసాంక్రమిక వ్యాధులు జనాన్ని చుట్టు ముడుతున్నాయి. అదుపు చేయకుంటే ఆరోగ్యాన్ని కబళించేస్తాయి.

- 91570మందికి రక్తపోటు
- 81668మందికి మధుమేహం
- 614మందికి క్యాన్సర్ లక్షణాలు
- మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లే వ్యాధుల విస్తృతికి కారణం
- ఎన్‌సీడీ సర్వేలో తేలిన వైనం



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో అసంక్రమిత వ్యాధుల గుర్తింపు (ఎన్‌సీడీ) 3.0 సర్వే జిల్లాలో చేపట్టారు. దీనిని గతేడాది నవంబరులో ప్రాంభించారు. ఈ ఏడాది మే చివరిలోపు పూర్తి చేయాలని గడువు విధించారు. జిల్లాలో 18 ఏళ్ల దాటిన వారు 1564277 మంది ఉండగా... అందులో 954643 మందిని అంటే 65 శాతం మందిని ఇప్పటిదాకా చేసినట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. ప్రధానంగా మధుమేహం, రక్తపోటు ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తుండగా, రాకాసి క్యాన్సర్ బాధితులు పెరిగిపోతుండడం ఈ సర్వేలో బయటపడింది.

- జిల్లాలో 91570 మంది రక్తపోటు సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తేలింది. రక్తపోటును అదుపు చేయకపోతే మెదడు, మూత్రపిండాలు, గుండె పనితీరుపై ప్రభావం చూపే అవకాశముంది. పక్షవాతం కూడా సోకే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.
- జిల్లాలో 81668 మంది చక్కెరవ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమేణా పెరుగుతూ వస్తోంది.రోజూ క్రమం తప్పకుండా వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటే రక్తంలో షుగర్ శాతం అదుపులో ఉంటుందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.
- ప్రాణాలు హరించే క్యాన్సర్‌తో జిల్లాలో 614 మంది బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇందులో ఓరల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు 239మంది కాగా, రొమ్ము క్యాన్సర్‌తో 194 మంది బాధపడుతున్నట్లు గుర్తించారు. 30 ఏళ్ల దాటిన 181 మంది మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ సోకినట్లు సర్వేలో తేలింది.

జిల్లాలో ఎక్కువ శాతం రక్తపోటు వ్యాధితో ప్రజలు బాధపడుతున్నారని సర్వే ద్వారా గుర్తించడం జరిగింది. ప్రజలకు అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. స్క్రీనింగ్‌లో వ్యాధులు బయటపడిన వారికి ఏది తినొచ్చు...ఏది తినకూడదు అనే విషయంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

-డీఎంహెచ్‌వో సుధారాణి



జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణ సారిక

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణ సారిక త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. మచిలీపట్నం జిల్లా జడ్జిగా వున్న ఈమె చిత్తూరు జిల్లాకు బదిలీపై రానున్నారు. ఇక్కడ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న భీమారావు బదిలీపై అనంతపురానికి వెళ్లనున్నారు.



హెచ్‌ఎం సుబ్రహ్మణ్యాన్ని విచారిస్తున్న విద్యాశాఖ నోడల్ అధికారి సుధాకర్

విద్యార్థులకు అందని ట్యాబ్‌లు

విచారణ చేపట్టిన విద్యాశాఖ

పుంగనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పంపించిన ట్యాబ్‌లను అందజేయని ప్రధానోపాధ్యాయుడిపై విద్యాశాఖ విచారణ చేపట్టింది.పుంగనూరు పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు అందజేసేందుకు ట్యాబ్‌లు పంపించారు.అయితే హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం వాటిని విద్యార్థులకు ఇవ్వలేదు.దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు.దీని ఫలితంగా డీఈవో ఆదేశాల మేరకు నోడల్‌అధికారి సుధాకర్ సోమవారం పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్యాబ్‌లు ఎందుకు ఇవ్వలేదని ఆరా తీశారు. దాదాపు 192 ట్యాబ్‌లు పాఠశాలలోనే నిల్వ ఉండడం గుర్తించి విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. దీంతో పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠాలు బోధించే సమయంలో విద్యార్థులు ట్యాబ్‌ల్లో పాటలు పెట్టుకోవడం, అందులో సినిమాలు చూడడం గుర్తించినట్లు తెలిపారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆలోచనతోనే ట్యాబ్‌లను విద్యార్థుల నుంచి తీసుకున్నట్లు తెలిపారు. ఎంఈవోలు చంద్రశేఖర రెడ్డి, రెడ్డెన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటిపంట

మళ్లీ మొదలైన గజదాడులు..!

- దిగుమూర్తివారిపల్లిలో పంటల ధ్వంసం

కల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై మళ్లీ గజ దాడులు మొదలయ్యాయి. ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లి వద్ద ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. పులిచెర్ల మండలంలో ఇటీవల ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది.ఏనుగుల గుంపు కొన్నాళ్ల క్రితం తలకోన అడవిలోకి, మరో గుంపు కళ్యాణి డ్యాం సమీపంలోని అడవిలోకి చేరుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కొద్దిరోజులుగా పంటలపై ఒంటరి ఏనుగు దాడులతో రైతులు మరింత నష్టాన్ని చవి చూశారు. తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి ఆదివారం రాత్రి దిగుమూర్తివారిపల్లి వద్దకు 5 ఏనుగులు గుంపుగా చేరుకున్నాయి. వీరరాఘవులునాయుడు, ఈశ్వర నాయుడు, జయచంద్ర నాయుడు, సురేంద్రకు చెందిన వరి, మామిడి, అరటి పంటలను ధ్వంసం చేశాయి. అనంతరం వచ్చిన దారిలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. పంటలను ధ్వంసం చేసిన ఐదు ఏనుగుల గుంపులో ఓ గున్న ఏనుగు ఉందని, దీంతో ఏనుగుల గుంపు సమీపంలోని అడవిలోనే ఉన్నట్లు ప్రజలు తెలిపారు.ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫీ, ఎఫ్‌బీవో కృష్ణమూర్తి అటవీప్రాంతంలోకి వెళ్లి ఏనుగుల గుంపు జాడను పరిశీలించారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

వడదెబ్బతో రైతు మృతి

పిచ్చాటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ తులసి కృష్ణాపురానికి చెందిన రైతు గురవయ్య(55) సోమవారం ఉదయం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన వడదెబ్బకు గురైనట్లు చెప్పారు. విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని ఇంట్లోనే పడుకోబెట్టారు. సోమవారం వేకువ జామున పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



గురవయ్య (ఫైల్ ఫొటో)

పల్లె దారులకు మహర్దశ

1,643 చోట్ల సిమెంటు రోడ్లు ● 33 ప్రాంతాల్లో బీటీ రోడ్లు







పూతలపట్టు మండలం పంటపల్లెలో సిమెంటు రోడ్డు పనులు - చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద ఎన్టీఆర్ కాలనీలో సిమెంటు రోడ్డు పనులు - పెనుమూరు మండలం గంగుపల్లెలో నిర్మించిన సిమెంటు రోడ్డు

చిత్తూరు (గాంధీ సర్కిల్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో పడకేసిన పల్లె పాలన.. కూటమి ప్రభుత్వ రాకతో అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది.సిమెంటు రోడ్లు, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, తాగునీటి కొళాయిలు, ప్రహరీ గోడలు వంటి పనులతో పల్లెల్లో సందడి నెలకొంది.ఈ పది నెలల కాలంలోనే ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోని పల్లెలకు 1,643 సిమెంటు రోడ్లు... 33 బీటీ రోడ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా వాటితో కలిపి మొత్తం రూ.107.71కోట్లు అంచనాతో 1,719 పనులు జిల్లాకు మంజూరయ్యాయి. వీటిలో గత నెలాఖరుకు 1,387పనులు పూర్తి చేశారు.124 పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం ఇప్పటి వరకు రూ.63.90కోట్లు ఖర్చు చేశారు.

వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు అభివృద్ధి పనులు లేక పల్లెలు వెలవెలబోయాయి. చేసిన అరకొర అభివృద్ధి పనులకు కూడా బిల్లులు రాక సర్పంచులు, కాంట్రాక్టర్లు లబోదిబోమన్నారు. బిల్లుల కోసం వారు రాజధానికి వెళ్లి ధర్నాలు కూడా చేశారు. వైసీపీ హయాంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు అచేతన స్థితిలో ఉండేవి.ఈ శాఖలకు కూటమి ప్రభుత్వం రాకతో ప్రాధాన్యత వచ్చింది. ఈ రెండు శాఖలు గ్రామీణ ప్రాంతాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాయి.'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి.. తమ పల్లెల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో ప్రజల నుంచి రాత పూర్వకంగా అభిప్రాయాలు సేకరించింది. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు జిల్లాలోని 31 మండలాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.78.89కోట్ల అంచనాతో 192.58కి.మీ. పొడవునా 1,605 సిమెంటు కాంక్రీట్ అంతర్గత రోడ్లు మంజూరు చేశారు. ఇందులో ఇంతవరకు 1,407 పనులు గ్రౌండింగ్ కాగా... 1,352 పనులు పూర్తి చేశారు. ఇందుకోసం రూ.56.81 కోట్లుఖర్చు చేశారు. 149.43కి.మీ. పొడవునా సిమెంటు రోడ్డు పనులు పూర్తి చేశారు. ఇక సిమెంటు కాంక్రీట్ అప్రోచ్ రోడ్ల విషయానికి వస్తే... రూ.6.52కోట్లు అంచనాతో 14.95కి.మీ. పొడవున 38పనులు మంజూరు చేశారు. ఇందులో 38పనులు గ్రౌండింగ్ కాగా... ఇప్పటి వరకు 7.30కి.మీ పొడవున 26 పనులు పూర్తి చేశారు. ఇందుకోసం రూ.3.25కోట్లు ఖర్చు చేశారు. బీటీ రోడ్ల విషయానికి వస్తే... రూ.10.60కోట్ల అంచనాతో 21.41కి.మీ. పొడవున 18 పనులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ 18 పనులు గ్రౌండింగ్ కావడంతో పాటు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులకు ఇప్పటి వరకు రూ.2.25కోట్లు ఖర్చు చేశారు. ఇక రూ.3.26కోట్ల అంచనాతో 42 ప్రహరీ గోడలు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటి వరకు 32 పనులు గ్రౌండింగ్ అయ్యాయి. తొమ్మిది పనులు పూర్తి చేశారు. ఇందుకోసం రూ.50.25లక్షలు ఖర్చు చేశారు. పల్లె పండుగలో భాగంగా ఉపాధి నిధులతో ఒక గ్రామ పంచాయతీ భవనాన్ని రూ.22లక్షలతో నిర్మిస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో రూ.8.20కోట్ల అంచనాతో 11.52కి.మీ. పొడవున 15పనులు మంజూరు చేశారు.ఇప్పటి వరకు ఈ రోడ్లకు రూ.89.68లక్షలు ఖర్చు చేశారు. పల్లె పండుగలో మంజూరైన మిగిలిన పనులు కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈ చంద్రశేఖర రెడ్డి చెప్పారు.

రూ.26.51కోట్ల బిల్లుల చెల్లింపు

'పల్లె పండుగ'లో భాగంగా రూ.107.71కోట్ల అంచనాతో 1,719 పనులు మంజూరు చేయగా.. గత నెల 31వ తేదీ వరకు 1,387 పనులు పూర్తయ్యాయి. మొత్తం రూ.63.90కోట్లకు గాను రూ.26.51కోట్ల బిల్లులు చెల్లించారు. ఇందులో సిమెంటు కాంక్రీట్ అంతర్గత రోడ్లకు రూ.25.22కోట్లు... సిమెంటు కాంక్రీట్ అప్రోచ్ రోడ్లకు రూ.98.10లక్షలు...బీటీ రోడ్లకు రూ.11.06లక్షలు... ప్రహరీలకు రూ.10.47లక్షలు... గ్రామ పంచాయతీ భవనానికి రూ.9.21లక్షలు చెల్లించారు. పూర్తయిన పనులకు ఇంకా రూ.38.81కోట్లు చెల్లించాల్సి ఉంది.



వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలోని కోనేరువీధిలో వేసిన సిమెంటు రోడ్డు



పద్మాంజలిదేవికి డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు అప్పగిస్తున్న పూర్వ డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

డీసీహెచ్‌ఎస్ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా పద్మాంజలిదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మాంజలిదేవికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆమెను చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు రెగ్యులర్ డీసీహెచ్‌ఎస్ పోస్టులో సుదీర్ఘ కాలం పాటు ఇన్‌చార్జులే కొనసాగుతూ వచ్చారు. సరళమ్మ చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా 10 ఏళ్లకు పైగా కొనసాగారు. ఆమెకు పదోన్నతి రావడంతో రాష్ట్ర వైద్య శాఖకు వెళ్లిపోయారు. ఆమె తర్వాత బీసీకే నాయక్‌ను చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా నియమించగా.. ఉన్నతాధికారులు చెప్పిన మాటవినలేదని అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ స్థానంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌గా ఉన్న రాజశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన స్థానంలో నగరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతికి చిత్తూరు ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు ఇచ్చారు. ఇప్పుడు పద్మాంజలిదేవి నియమించడంతో ప్రస్తుత డీసీహెచ్‌ఎస్ ప్రభావతి గతంలో పనిచేస్తున్న నగరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

సమస్యలివిగో....స్పందించండి

కలెక్టరేట్‌కు 342... పోలీసుశాఖకు 45 అర్జీలు



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ వినతిపత్రాలను స్వీకరించారు. అలాగే డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ తదితర అధికారులు బాధితుల నుంచి అర్జీలను తీసుకున్నారు.

మా పాఠశాల మార్చకండి: ఒడ్డుపల్లెలో ఉన్న ఎంపీపీఎస్ స్కూల్‌లోనే 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలని ఎస్ఆర్‌పురం మండలం ఒడ్డుపల్లె గ్రామస్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కోరారు. విద్యార్థుల శాతం తక్కువగా ఉన్న కారణంగా పక్కనే ఉన్న పాఠశాలలో కలపడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఇలాచేయడం వల్ల కూలి పనులు చేసుకునే తాము రోజు పిల్లల్ని ఆటోల్లో పంపడానికి భయంగా ఉందన్నారు. అధికారులు పునరాలోచించి ప్రస్తుతం ఉన్న ఒడ్డుపల్లెలోనే ఉండేవిధంగా చూడాలని కోరారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోండి: ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పెనుమూరు మండలం కమ్మచన్నయ్యపల్లె గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 906లో ఏడు ఎకరాలు, 911లో 1.82 ఎకరాలు, 907లో 0.75 ఎకరాలు, 908లో 1.47 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. ఈ భూమిలో విద్యార్థులకు ఆటస్థలం, ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. ఈభూములను కొంత మంది ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారని, అడిగితే గ్రామస్థులపై దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని పెనుమూరు మండలం కంబాలచేనుకు చెందిన గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 902లో 1.78 ఎకరాల రస్తా, 985లో 44 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూములను కొంత మంది ముళ్ల కంచెలు వేసుకుని కొద్దికొద్దిగా అమ్ముకుంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి: అమ్మా, నాన్న లేని తనకు సదరం సర్టిఫికెట్‌ను మంజూరు చేసి పింఛన్ వచ్చే విధంగా చూడాలని యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీలోని షికారీ కాలనీకి చెందిన వికలాంగురాలైన నందిని కోరారు. గతంలో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే బంగారుపాళ్యం మండల ప్రభుత్వాస్పత్రికి వెళ్లానని, అక్కడ పరిశీలించిన తరువాత సర్టిఫికెట్‌ను పంపిస్తామన్నారని తెలిపారు. నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి: తమకు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని జీడీ నెల్లూరు మండలం వెంకటాపురం పంచాయతీ మిట్ట కొత్తూరుకు చెందిన 14 కుటుంబాల ఎస్టీలు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. గతంలో కాలనీలో కొంత మందికి పట్టాలిచ్చారని, 14 కుటుంబాల వారు మిగిలిపోయారన్నారు. అప్పటి నుంచి స్థలాలు మంజూరు చేయాలను ప్రాధేయపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

● కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 343 మంది అర్జీదారులు హాజరై అర్జీలను అధికారులకు అందించారు. నిర్ణీత సమయంలోగా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో శాఖలవారీగా.. రెవెన్యూశాఖకు 296, డీఆర్‌డీఏకు 22, పోలీసుశాఖకు 10, పంచాయతీరాజ్‌కు 4, డీఎస్‌వోకు 4, విద్యుత్‌శాఖకు 2, మిగిలినశాఖలకు ఐదు అర్జీలు అందాయి.

● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 45 మంది అర్జీదారులు హాజరై ఎస్పీ మణికంఠ చందోలుకు సమస్యలతో కూడిన అర్జీలను అందించారు. అదేవిధంగా ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబులను కలిసి సమస్యలను మొరపెట్టుకున్నారు. బాధితుల సమస్యలను విన్న వారు పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో భూ తగాదాలు 13, డబ్బులు తగాదాలు 10, కుటుంబ తగాదాలు 9, చీటింగ్ 4, వేధింపులు 4, దారి సమస్యలు 3, ఇంటి తగాదా, ఆస్తి తగాదాల కింద ఒక్కో అర్జీ వంతున అందాయి.







ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కలెక్టరేట్‌కు వచ్చిన జీడీ నెల్లూరు మిట్ట కొత్తూరు గ్రామస్తులు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌కు వచ్చిన పెనుమూరు కంబాలచేను గ్రామస్తులు, బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

వేములో ఏఐసీటీఈ ఐడియాల్యాబ్ ప్రారంభిస్తాం



చంద్రశేఖర్ నాయుడు , నవీన్

పూతలపట్టు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో త్వరలో ఆలిండియా కౌన్సిల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఐడియా ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నమైన ఐడియాతో వస్తే వారికి మెటీరియల్‌తో పాటు వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తామని అన్నారు. జిల్లాలో వేము ఇంజనీరింగ్ కళాశాల ఒక్కటే ఐడియా ల్యాబ్‌కు ఎంపిక కావడం సంతోషకరం అన్నారు. ప్రతి విద్యార్థి చదువుకుంటూ సంపాదించే అవకాశాన్ని తమ కళాశాల కల్పిస్తుందని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ద్వారా నడిచే మూడు చక్రాలను ఎలక్ట్రికల్ ఆటోలుగా తయారుచేసేందుకు తమ కాలేజి మంచి ఐడియాతో ముందుకొస్తుందన్నారు. వచ్చేనెలలో తమ కాలేజి ద్వారా ఈ ప్రయోగాన్ని ప్రారంభిస్తామన్నారు. జూన్‌లో కళాశాల ఆవరణలో ఎలక్ట్రికల్ వాహనాలకు చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బెంగళూరుకు చెందిన టెక్నాల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఈ కంపెనీ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఐడియా ల్యాబ్ ఒక సువర్ణ అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి పాల్గొన్నారు.

నాటు బాంబు కేసులో ఇద్దరికి రిమాండ్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏనుగు కాలికి గాయమైన సంఘటనకు సంబంధించి నాటు బాంబు అమర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. అడవి పందుల వేట కోసం గత గురువారం అటవీ పశ్చిమ విభాగం బంగారుపాళ్యం మండలం బోడబండ్ల, జమ్మునేరేడుపల్లి ప్రాంతాల్లోని తోటల్లో నాటు బాంబులు అమర్చారన్నారు. దీనిపై గ్రామానికి చెందిన పలువురిని అదుపులోకి తీసుకుని విచారించగా, బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంటకు చెందిన విశ్వనాథ్(39), జమ్మునేరేడుపల్లికి చెందిన వెంకటేశులు(29)లు ఘాతుకానికి పాల్పడినట్లు తేలిందన్నారు. ఈ ఘటనలో ఒక కుక్క మృతి చెందగా, అటుగా వస్తున్న గుంపులోని ఓ ఏనుగు కాలికి గాయమైన విషయం తెలిసిందే. ఘటనా ప్రాంతలో గాలింపు చేపట్టగా, కన్పించిన మరో నాలుగు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఆమె స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెనుక నుంచి క్రేన్ ఢీకొని ఒకరి మృతి





క్రేన్ ఢీకొనడంతో చనిపోయిన శేషన్

నగరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరి నుంచి నాగరాజు కుప్పం వెళ్లే మార్గంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగిన రోడ్డుప్రమాదంలో శేషన్ (శేషాచలం) (64) మృతి చెందాడు. పోలీసుల కథనం మేకు వివరాలిలా వున్నాయి. సీఐ విక్రమ్ కథనం మేరకు విజయపురం మండలం చిన్న మహావీరపురానికి చెందిన శేషన్ సోమవారం నాగరాజుకుప్పం వైపు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన క్రేన్ ఢీకొని తొక్కేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు 108 వాహనం ద్వారా తరలించారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని క్రేన్‌ను పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మృతుడి కుమారుడు కర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీటీడీ ట్రస్టులకు రూ.కోటి విరాళం



రూ.కోటి విరాళ డీడీలను అదనపు ఈవోకు అందజేస్తున్న ఆ సంస్థల ప్రతినిధి రాఘవేంద్ర

తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని వివిధ ట్రస్టులకు సోమవారం రూ.కోటి విరాళంగా అందింది. ఒడిశాకు చెందిన శివమ్ కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.20 లక్షలు, స్విమ్స్ ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. అలాగే అదే రాష్ట్రానికి చెందిన బలభద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. రంగనాయకమండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర విశ్వకర్మ డీడీలను అందజేశారు.

పీవీకేఎన్‌లో యూజీ, పీజీ పరీక్షలు



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎస్వీయూ ప్రొఫెసర్లు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూజీ, పీజీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెస్సీ, ఎం.ఏ, ఎంబీఏ, ఎం.కాం, బి.కాం, తదితర గ్రూపు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 2న మొదలైన పరీక్షలు 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో సోమవారం తిరుపతి ఎస్వీయూ ప్రొఫెసర్లు రమేష్‌బాబు, రవి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ విధానాన్ని ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, పరీక్షల విభాగం అధికారి శరవణను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. విదార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరంలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు శరవణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఉరేసుకుని మృతి చెందిన సంఘటన సోమవారం పుంగనూరు మండల పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని కుమ్మరనత్తం పంచాయతీ కపాడమిట్టపల్లెకు చెందిన గంగులప్ప, భార్య కవిత (35) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కవిత తన అక్క ఈశ్వరమ్మ, చెల్లెలు రోజాలకు కొంత గడును చేయి బదులు ఇచ్చింది. దీంతో గంగులప్ప తన కుమార్తె వివాహానికి 20 రోజులు గడువు ఉండటంతో డబ్బు అవసరమని ఇచ్చిన నగదు తీసుకురావాలని భార్య కవితకు సూచించాడు. మూడురోజుల క్రితం నగదు తీసుకొస్తానని చెప్పి వెళ్లిన కవిత శనివారం సాయంత్రం రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లె నుంచి బయలుదేరింది. రాత్రి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం కవిత ఆచూకీ కోసం బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. హిమాలయ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో కవిత ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో గ్రామస్తులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వీఆర్వో ఏమయ్యారు?

● 16 మందికి పంపిణీ చేయని పింఛను

● వారమైనా కానరాని ఆచూకీ

సత్యవేడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సత్యవేడు-1వ సచివాలయంలోని వీఆర్వో చిట్టిబాబు తన పరిధిలోని 16 మందికి ఇంకా పింఛను పంపిణీ చేయలేదు. వారమైనా ఆయన ఆచూకీ లేదు. దీంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ సచివాలయ పరిధిలో 64 మందికి పింఛను అందించడానికి రూ.2.68లక్షలను వీఆర్వో చిట్టిబాబుకు పంచాయతీ కార్యదర్శి ఇచ్చారు. 48 మందికి రూ.2.02 లక్షలను పంపిణీ చేసిన వీఆర్వో.. 16 మందికి ఇవ్వలేదు. ఈ విషయం తెలిసి ఉన్నతాధికారులు ఫోన్‌ద్వారా వీఆర్వోను సంప్రదించగా, ఆర్డీవో కార్యాలయంలో అత్యవసర సమావేశానికి వెళ్లడంతో పంపిణీ చేయలేకపోయినట్లు చెప్పారు. కానీ, వారం రోజులవుతున్నా వీఆర్వో ఆచూకీ లేదని, ఆయన సెల్‌ఫోను స్విచ్ఛాఫ్ అయినట్టు పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ చెప్పారు. కాగా, మండలంలోని కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ షాహిదుల్లా కొత్తమారికుప్పంలో లబ్ధిదారులకు ఈనెల పింఛను రూ.2,63,000 ఇవ్వకుండా పరారైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీఆర్వో వైఖరిపై అధికారుల్లో ఆందోళన నెలకొంది.

బాధితులతో కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే



నియోజకవర్గ సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కావడంతో అక్కడ సమస్యలు కూడా అధికంగానే ఉన్నాయని, అన్ని నియోజకవర్గాల మాదిరిగా కాకుండా మా నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా గుర్తించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ కోరారు. నియోజవర్గ ప్రజలతో కలిసి సోమవారం ఆయన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తవణంపల్లె మండలం ఎ.గొల్లపల్లె దళితవాడలో 50 ఏళ్ల నుంచి ఉంటున్న వారి గృహాలకు గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. దళితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారి గృహాల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండే విధంగా చూడాలని కోరారు. 20 నుంచి 25 రోజుల్లోపు ప్రత్యేక అధికారిని నియమించి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే బంగారుపాళ్యం మండల కేంద్రంలో దహన క్రియలకు స్థలం లేదని, గ్రామస్థుల అవసరాలను గుర్తించి శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరగా.. శ్మశాన వాటిక స్థలానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి కొనుగోలు చేసివ్వడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

డిగ్రీ కళాశాల స్థలానికి పరిహారం చెల్లించండి



రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

నగరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరి డిగ్రీ కళాశాలకు చెందిన సుమారు ఎకరా స్థలం వరకు రోడ్డు విస్తరణ పనుల్లో పోతున్నందున కళాశాలకు నష్టపరిహారం చెల్లించాలంటూ సోమవారం విద్యార్థులు రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో చెన్నై-తిరుపతి జాతీయ రహదారిపై వాహనాలు కి.మీ. మేర ఆగిపోయాయి. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. 1976లో చెన్నైకి చెందిన మోతీ అనే వ్యక్తి డిగ్రీ కళాశాల కోసం 20 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. అందులో జూనియర్ కళాశాలకు 3 ఎకరాలు పోను 17 ఎకరాలు డిగ్రీ కళాశాలకు వినియోగిస్తున్నారు. పుత్తూరు-తిరువళ్లూరు రోడ్డును రెండులైన్ల నుంచి నాలుగు లైన్లకు విస్తరణ చేస్తుండటంతో కళాశాలకు చెందిన ఎకరాకు పైగా స్థలం పోతోందని, అదీగాక కాంపౌండ్‌వాల్ (ప్రహరీగోడ) కూడా పోతుండటంతో తమకు నష్టపరిహారం చెల్లించాలని విద్యార్థులు ధర్నా చేపట్టినట్లు ఆయన తెలిపారు. సీఐ విక్రమ్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో చర్చించారు. ఆర్డీవో భవాని శంకరి కూడా ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌తో చర్చించడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

నష్టపరిహారం అందేలా చూస్తాం

డిగ్రీ కళాశాల స్థలాన్ని దాత విరాళంగా ఇచ్చినందున ఏ మేరకు స్థలం రోడ్డు వెడల్పులో పోతుందో దానికి ప్రభుత్వ నిబంధనల మేర నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం.

- ఆర్డీవో భవానిశంకరి

రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక





ఎంపికైన బాలుర జట్టు, బాలికల జట్టు

చిత్తూరు క్రీడలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ అండర్-16 బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చెంగల్రాయ నాయుడు, చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మెసానికల్ మైదానంలో జట్టు సభ్యులను పరిచయం చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరగనున్న 40వ జాతీయ స్థాయి అండర్-16 యూత్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొంటారన్నారు. ఇందుకు కోసం చిత్తూరులో గత నెల 30 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణా శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. అందులో 12 మంది చొప్పున బాలబాలికల జట్లను ఎంపిక చేశామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో ఆడి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. మంచి ప్రతిభ కనబరిచి క్రీడా కోటాలో ఉద్యోగవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ సీఐ మురళీమోహన్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సురేష్‌బాబు, డీఎస్‌డీవో బాలాజీ, కోచ్‌లు బాబు, జగదీష్, ప్రసన్నకుమార్, శ్రీనివాసులు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ విజిట్ తర్వాతే బాండ్లు జారీ

● నాలుగో రోజూ క్యూకట్టిన టీడీఆర్ బాధితులు ● 284 డాక్యుమెంట్లు లాగిన్



టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌లో అర్జీలు స్వీకరిస్తున్న రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అదనపు డైరెక్టర్ వరప్రసాద్

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్ నాలుగో రోజైన సోమవారం బాధితులు కార్పొరేషన్ కార్యాలయానికి క్యూ కట్టారు. డాక్యుమెంట్లను తీసుకొచ్చి టౌన్ ప్లానింగ్ సిబ్బందికి అందజేశారు. గడిచిన నాలుగు రోజులుగా 29 మాస్టర్ ప్లాన్ రోడ్లకుగాను 26కు సంబంధించి 284 ఆస్తుల డాక్యుమెంట్లకు లాగిన్ చేశారు. 190 దరఖాస్తులకు వాలిడేషన్ పూర్తిచేయగా మరో 94 సిద్ధంగా ఉన్నాయి. 21 టీడీఆర్ దరఖాస్తులను సిటిజెన్స్ లాగిన్‌లో అప్‌లోడ్ చేశారు. మంగళగిరి నుంచి వచ్చిన టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ వరప్రసాద్ మేళాను పర్యవేక్షించారు. అర్హుల జాబితా కొలిక్కి వచ్చాక క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే బాండ్లు జారీ చేస్తామని చెప్పారు.

స్థలం మాది...బాండ్లు మరొకరికి

హీరోహోండా షోరూం పక్కన వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డుకు నా స్థలం కోల్పోయాను. టీడీఆర్ బాండ్లు నాకు కాకుండా, తప్పుడు పత్రాలు సమర్పించిన వ్యక్తికి ఇచ్చేశారు. న్యాయం చేయాలని పలుమార్లు అధికారులను కలిశాను. హైకోర్టునూ ఆశ్రయించాను. డాక్యుమెంట్లు పరిశీలించి అర్హుడైన నాకు బాండ్లు ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చా.

- శ్రీహరి రెడ్డి, తిరుపతి

బాండ్లను రిలీజ్ చేయమని కోరా

డీబీఆర్ మాస్టర్ ప్లాన్ రోడ్డులో 400 చదరపు గజాల స్థలాన్ని కోల్పోయాం. గతంలోనే టీడీఆర్ బాండ్లు తీసుకున్నాం. బాండ్ల జారీలో జరిగిన అవకతవకల ఆరోపణల నేపథ్యంలో మాకిచ్చిన బాండ్లనూ హోల్డ్‌లో పెట్టారు. వాటిని వినియోగించుకునేందుకు వీలుగా విడుదల చేయాలని కోరా.

- ప్రసాద్, ఏడీసీ, చిత్తూరు నగరపాలక సంస్థ

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పం మండల సచివాలయంలో ఆయన సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో మాట్లాడి సమస్య మూలాలను తెలుసుకున్నారు. అనంతరం కడా పీడీ మాట్లాడుతూ తాను, జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డేల ద్వారానే కాకుండా జన నాయకుడు గ్రీవెన్స్‌సెల్‌లోనూ ప్రజల నుంచి అర్జీలు అందుతున్నాయన్నారు. వీటిలో ముందుగా ఆర్థిక సంబంధం లేని సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, ఒకవేళ ఆర్థికంగా అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా శాఖల పరిధిలోని నిధులు లేదా తన పరిధిలోని నిధులలో ఈ సమస్యకు, ఎంతమేర ఉపయోగించవచ్చో ఓ అంచనాకు వచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూత వాహనంపై ఊరేగిన భోళాశంకరుడు



రామకుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం స్వామి వారు భోళాశంకరుడై సతీసమేతంగా భూత వాహనంలో ఊరేగారు. స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మూలమూర్తికి రుద్రాషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న అమృతవల్లి

రామకుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రణాళికబద్ధంగా చేస్తే ప్రతి రైతు అధిక ఆదాయాన్ని పొందుతారని ప్రకృతి వ్యవసాయం కుప్పం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి అమృతవల్లి తెలిపారు. సోమవారం రామకుప్పం మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం - ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రణాళికల తయారీపై ఎన్ఎఫ్ఏ మహేష్, వెలుగు ఏపీవో శ్రీనివామూర్తి, మాస్టర్ ట్రైనర్ లక్ష్మీరెడ్డి, మెంటర్ వెంకటరమణ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో అమృత, విస్తరణాధికారి బాలరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బేలుపల్లెలో సత్యనారాయణస్వామికి పూజలు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలుపల్లె గ్రామంలో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి స్వామివారికి పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి శేషగిరి, మురళీకృష్ణ, రవి, సుబ్బారావు, శీనప్ప, ఆనందరావు ఉభయదారులుగా వ్యవహరించారు.



క్షేత్రస్థాయి సందర్శనలతోనే భూసమస్యల పరిష్కారం

సోమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి భూసమస్యలైనా క్షేత్రస్థాయిలో సందర్శించి పరిష్కరించాలని తహసీల్దార్ బెన్నురాజ్ పేర్కొన్నారు. సోమవారం వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చి అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ చౌకదుకాణాల్లో బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, అక్రమాలు జరగకుండా వీఆర్వోలు తనిఖీలు చేయాలన్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలన్నారు. డీటీ ఇబ్రహీం, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం సోమవారం దర్శించుకున్నారు. వారిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



పలమనేరు: కొలమాసనపల్లిలో ర్యాలీ

కుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆశాజనక భవిష్యత్తు ఆరోగ్యంతోనే సాధ్యమవుతుందని పీఈఎస్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈఎస్ ఆసుపత్రిలో ప్రసూతి విభాగంలోని మహిళలకు నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'ఆరోగ్యకరమైన ఆరంభం - ఆశాజనక భవిష్యత్తు' అనే నినాదంతో మాతా శిశు ఆరోగ్య సంరక్షణను ప్రధాన అంశంగా చూడాలన్నారు. ప్రసూతి - నవజాత శిశు మరణాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మాతా శిశు ఆరోగ్యాన్ని పెంచే దిశగా ప్రోత్సాహం, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండటం కోసం తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఈఎస్ ఆసుపత్రి ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డేనియల్ అరుణ్‌కుమార్, సీహెచ్ఎన్ విభాగాధిపతి సుభా వెళ్విజి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మెల్విన్ డేవిడ్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ పవిత్ర, డాక్టర్ దివ్యశ్రీ, అధ్యాపకులు రామకృష్ణ, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే.. ఆనందం

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

● బైరెడ్డిపల్లె: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సంరక్షణపై వైద్యాధికారి విజయచందర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్లు గోపి, పుష్పలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● పలమనేరు: ప్రతిఒక్కరూ శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పలమనేరు మండలం కొలమాసనపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యులు సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, వైద్యసిబ్బంది విజయలక్ష్మి, మధు, అంజలి, ఆశాలక్ష్మి, ప్రజలు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: చౌడేపల్లెలో డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సరైన వయస్సులో వివాహం చేసుకోవాలని, ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు తల్లీబిడ్డకు సురక్షితమని సూచించారు.

●రొంపిచెర్ల: రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్, డాక్టరు వినయ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సేవలు అందించడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి వైద్యాధికారులు బహుమతులు అందజేశారు. సీహెచ్‌వో వాంతమ్మ, హెచ్ఈ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● రామకుప్పం: ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తే ప్రతిఒక్కరూ బంగారు భవిష్యత్తు పొందుతారని రామకుప్పం మండలం విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పూజిత తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజలాపురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, హెచ్ఈ ప్రమీళ, హెచ్ఎ కృష్ణవేణి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● కల్లూరు: సరైన జీవన శైలితోనే ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ వైద్యాధికారిణి జానకీరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.



బైరెడ్డిపల్లెలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయచందర్



చౌడేపల్లెలో అవగాహన ర్యాలీ



రొంపిచెర్లలో....



కుప్పంలో అవగాహన కల్పిస్తున్న వైద్య ప్రముఖులు, నర్సింగ్ విద్యార్థులు



విజలాపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

బకాయి డీఏలను మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నుంచి పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏలను త్వరలో మంజూరు చేయాలని పలమనేరు పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం పెన్షనర్ల భవనంలో జరిగి న పెన్షనర్ల సమావేశానికి విజయకుమార్ అధ్యక్షత వహించి మాట్లడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసి అనేక ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉన్న పెన్షనర్ల బకాయిలన్నింటినీ ప్రభుత్వం దశల వారీగా చెల్లించాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి దొరస్వామి, సహ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట.. బోయకొండ నిర్వాసితుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బోయకొండ నిర్వాసితులు

పలమనేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం బోయకొండ ఆలయ నిర్వాసితులు ధర్నా చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్స్‌కవేటర్లతో కూలగొట్టిన ఇళ్లు, దుకాణాలు కోల్పోయి మూడేళ్లు గడుస్తున్నా తమకు ఎవరూ న్యాయం చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో భవాని కార్యాలయంలోకి పిలిపించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఆమూరి రాజేష్



చల్లా చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రాజేష్

కల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కల్లూరుకి చెందిన అమూరి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ప్రభుత్వ వైద్యం పేదలందరికీ అందేలా ఆసుపత్రి కమిటీ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, టీడీపీ నాయకులు మురళీధర్‌నాయుడు, కరుణాకర్‌నాయుడు, అనిల్‌కుమార్, ఖాదర్‌వల్లి, అబ్బాస్, మహేష్, ఇమ్రాన్, ప్రసాద్, గోపినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయంభేశ్వరుడికి అభిషేక పూజలు

సోమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వర ఆలయంలో సోమవారం మూల విరాట్‌కు పలు రకాల పుష్పాలతో అలంకరణలు చేసి అభిషేక పూజలు చేపట్టారు. ఉభయదారులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

పలమనేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని పలమనేరు ఆర్డీవో పి.భవాని తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సూచించారు. సోమవారం ఆమె స్థానిక కార్యాలయంలో సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పలు సమస్యలకు పరిష్కారం చూపగా.. పలు సమస్యలపై ఆయా మండలాల తహసీల్దార్లతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు.



ఆర్డీవో భవానికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ ఫ్రంట్ నాయకులు

● పలమనేరు మున్సిపాలిటీలో రెండు దశాబ్దాలు క్రితం నిర్మించిన గంటావూరు ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీసీ ఫ్రంట్ నాయకులు ఆర్డీవో భవానికి వినతి పత్రం సమర్పించారు. కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయం వెనుక వైపు ఉన్న 40 అడుగుల రోడ్డు ఆక్రమణలు తొలగించాలని, సీసీ రోడ్లు వేయించాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని, తాగు నీటి కోసం ట్యాంకు నిర్మించాలని కోరారు.

ఆవులకుప్పంలోనే నిత్యావసరాలు పంపిణీ చేయాలి

రామకుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత మూడు నెలలుగా తమ గ్రామానికి నిత్యావసరాల పంపిణీ చేస్తున్న వాహనం రావడం లేదని.. తమ గ్రామంలోనే సరకులు పంపిణీ చేయాలని సోమవారం మండలంలోని ఆవులకుప్పం గ్రామస్తులు తహసీల్దారు కొలేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వాహనం రాకపోవడంతో 3 కి.మీ దూరంలోని ముద్దనపల్లెకు వెళ్లి చౌకదుకాణంలో నిత్యావసరాలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. ఎండలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని.. అక్కడకు వెళితే సర్వర్ పని చేయడం లేదని చెబుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నామని వాపోయారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వారికి హామీ ఇచ్చారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

రసాయన ఎరువుల వాడకంతో అనారోగ్యం



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు రసాయన ఎరువులు వాడకంతో భూములు దెబ్బతినడంతో పాటు ఆహారంగా తీసుకుంటే అనార్యోగానికి గురవుతున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంఘమిత్రలు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, మహిళా సంఘాల లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని సూచించారు. ఏడీఏ శివకుమార్ మాట్లాడుతూ మహిళలు ఇళ్ల వద్ద నవధాన్యాలు, కూరగాయలు పండించుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఏవో రాజేశ్, ఏపీఎంలు కృష్ణప్ప, కదిరప్ప, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లె పంచాయతీ రావిళ్లవారిపల్లెలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో మూలవిగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదాతలుగా సురేంద్రచౌదరి కుటుంబసభ్యులు వ్యవహించారు.

● రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ కమ్మపల్లెలో సోమవారం జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో చల్లా రామచంద్రారెడ్డి పాల్గొని సీతారాములకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు శేషాద్రినాయుడు, మోహన్‌నాయుడు, రవికుమార్ నాయుడు, మదనమోహన్‌రెడ్డి, ముద్దుకృష్ణ, అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ జయరామయ్య పాల్గొన్నారు.

● సోమల: సోమల మండలం పత్రపల్లెలో కొలువుదీరిన సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం సీతారాముల ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. నూతన ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించి ఉత్సవ విగ్రహ దాతలు రామకృష్ణయ్య కుటుంబ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. దాతలు బాలసుబ్రహ్మణ్యం, శరత్‌బాబు, రమేశ్‌నాయుడులను గ్రామస్తులు అభినందించి తీర్థప్రసాదాలు అందజేశారు.



సోమల: పత్రపల్లెలో ఊరేగిన సీతారాములు

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఆపద సమయాల్లో ఆ కుటుంబానికి భరోసాగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని తుంబపాళ్యంలో సభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే కార్యకర్తలను ఆదుకోవడానికి చంద్రన్న బీమా పథకం అండగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యకర్తల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషశ్రీ, ఉపసర్పంచ్ చిరంజీవి, బూత్ ఇన్‌చార్జి గురుస్వామి యాదవ్, కార్యకర్తలు గోవిందయ్య, దామోదరం, బొజ్జయ్య, పద్మనాభం, భాస్కర్, గిరిబాబు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 13 అర్జీలు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి కమిషనర్ నరసింహప్రసాద్ అర్జీలను స్వీకరించారు. సమస్యలను పరిష్కరిస్తానని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పింఛన్ల కోసం 7, ఇంజనీరింగ్‌శాఖకు 4, రెవెన్యూకు 2 చొప్పున మొత్తం 13 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం

● ఎమ్మెల్యే, డీఆర్డీఏ పీడీ

యాదమరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మురళీమోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం 50 మందితో కూడిన సభ్యులకు కుట్టు, అల్లికలు, మగ్గం మిషన్ శిక్షణ 'సంకల్ప్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం సహకారం అందజేస్తుందన్నారు. మహిళల ఉపాధి కోసం త్వరలోనే గార్మెంట్స్ పరిశ్రమను మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్వయం సమృద్ధి సంపద సృష్టికి అందరూ సమిష్టిగా కృషిచేయాలని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్ఐ ఈశ్వర్, ఎంఈవో రుక్మిణి, ఏవో చరిత, టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ యాదవ్, నాయకులు హేమగిరి, అమర్‌నాథ నాయుడు, మాధవ, భజలింగం, చిత్ర, వేణు నాయుడు, గోపిగౌడ్, కుమార్, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం, గోసంరక్షణకు విరాళం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,000 హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.రవి శంకర్ సోమవారం సాయంత్రం విరాళంగా అందించారు. విరాళ దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గరుడ, హనుమంత వాహన సేవలు


గరుడ వాహనంపై కోదండరామస్వామి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. విశేష అలంకారంలో ఎన్‌పి చెంగల్రాయ నాయుడు, వీరరాఘవులు నాయుడు కుటుంబ సభ్యుల ఉభయంతో ఈవో సుబ్రహ్మణ్యం నాయుడి ఆధ్వర్యంలో ఘనంగా గరుడ సేవ నిర్వహించారు. తొలుత వేకువ జామున గోపుర దర్శనం నిర్వహించి, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవాల్లో శ్రీధర్, నందగోపాల్, ఆనంద్ కుమార్, నటరాజన్, అఖిలమ్మ, సురేంద్రారెడ్డి, రాజశేఖర్ నాయుడు, చిట్టిబాబు, భవ్యసిల్క్ యజయానుల ఉభయంతో వైభవంగా హనుమంత వాహనసేవ నిర్వహించారు. బంగ్లా ఎన్‌పి. వెంకటేశ్వర చౌదరి, ఎన్‌పి వెంకట్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

పెనుమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):పెనుమూరు మండలం చిన్న కలికిరి పంచాయతీకి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ ఆర్.చిట్టికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.1,86,210 చెక్కును అందించారు. చిత్తూరు ఎంపీ కార్యాలయంలో సోమవారం బాధితుడికి ఈ చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కృషి చేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ కఠారి హేమలత, జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, బీసీసెల్ అధ్యక్షుడు అశోక్, కలికిరి మాజీ సర్పంచ్ భాస్కర్, తెలుగు యువత కార్యదర్శి గుర్రప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డైయింగ్ యూనిట్లను నివాసేతర ప్రాంతాలకు తరలించండి

- అఖిలపక్ష కమిటీ సభ్యుల వినతి


వినతిపత్రంతో కోర్టు బయట నిల్చున్న అఖిలపక్ష కమిటీ సభ్యులు

నగరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డైయింగ్ యూనిట్లను నివాసేతర ప్రాంతాలకు తరలించి నగరి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని రసాయన రంగునీటి వ్యతిరేక పోరాట అఖిలపక్ష కమిటీ సభ్యులు సోమవారం స్థానిక జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ విష్ణువర్మకు వినతిపత్రం అందించారు. అనంతరం కోర్టు బయట వారు మాట్లాడుతూ తమిళనాడులో ప్రజలకు హానికరమని డైయింగ్ యూనిట్లను మూసివేశారని, ఇక్కడ కూడా హాని కలిగించే డైయింగ్ యూనిట్లను మూసివేయాలని కోరారు. అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు గజేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న కోదండయాదవ్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఆపద సమయాల్లో ఆ కుటుంబానికి భరోసాగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని తుంబపాళ్యంలో సభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే కార్యకర్తలను ఆదుకోవడానికి చంద్రన్న బీమా పథకం అండగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యకర్తల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషశ్రీ, ఉపసర్పంచ్ చిరంజీవి, బూత్ ఇన్‌చార్జి గురుస్వామి యాదవ్, కార్యకర్తలు గోవిందయ్య, దామోదరం, బొజ్జయ్య, పద్మనాభం, భాస్కర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా కేడియ ఉత్సవం


కేడియ ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న పంగుణి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ న్యాయవాది ఆదినారాయణ రెడ్డి, సుభాష్ చంద్రబోస్, ధనూజ్ కుమార్ దంపతుల ఉభయంతో ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో అర్చకులు శివకుమార్ శివాచార్యులు కేడియ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నగర వణిగ వైశ్యసంఘం ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, గజ వాహనంపై అధిష్ఠింపజేసి పుర వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాల్లో కాలభైరవ ట్రస్టు వ్యవస్థాపకులు టి.వెంకటేషన్, లత జ్యూవెలరీస్ అధినేత మల్లీ ఆచారి దంపతులతో పాటు, భక్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం సోమవారం దర్శించుకున్నారు. వారిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ఐరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేస్తే మంచి దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులకు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటకు ముందు పొలంలో నవధాన్యాలు చల్లుకోవడం వలన భూసారం పెరుగుతుందన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఎన్‌ఎఫ్‌ఏ కవిత, మాస్టర్ ట్రైనర్ హనుమంతు, ఏఈవో మురళి, యూనిట్ ఇన్‌చార్జి హైమావతి, యతేంద్ర, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిండ్ర: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు వస్తాయని ఎన్‌ఎఫ్‌ఏ అధికారి నాంచారమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. పలువురు వ్యవసాయ సంబంధిత అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసే ఆహార పదార్థాలు తీసుకోవడం వలన ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతిభ కనపరిచిన రైతులను సన్మానించారు. అధికారులు ఎం.టి.ప్రతాప్, వ్యవసాయాధికారి తులసి, ఏపీఎం నరసింహులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి, గోసంరక్షణకు విరాళం


విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,000 హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.రవిశంకర్ సోమవారం సాయంత్రం విరాళంగా అందించారు. విరాళ దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో సినీ దర్శకుడు


సినీ దర్శకుడికి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు

ఐరాల (కాణిపాకం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు మారుతి కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

వృషభ వాహనంపై కరకంఠేశ్వరుడు



నగరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు వృషభ వాహనంపై ఊరేగారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు స్వామి వారిని మాడవీధుల్లో వృషభ వాహనంపై ఊరేగించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు సుబ్రహ్మణ్యం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయం కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల గంజాయితో పట్టుబడిన నిందితుల్లో బంగారుపాళ్యం మండలం చీకూరుపల్లెకు చెందిన వాసు పరారయ్యాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం నిందితుడు గ్రామంలో ఉన్నాడనే పక్కా సమాచారంతో అతడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నెట్టి కంఠయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


గంగయ్య (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడు. బంగారుపాళ్యం ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు మండలంలోని నలగాంపల్లెకి చెందిన కన్నయ్య కుమారుడు గంగయ్యకు ఈ నెల 3వ తేదీన తన ద్విచక్ర వాహనంలో నలగాంపల్లె సమీపంలోని స్పైసీ విల్లా హోటల్ సమీపంలో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన వైద్య నిమిత్తం రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి గంగయ్య(44) మృతి చెందాడు. గంగయ్య అన్న విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి


దేవేంద్రరెడ్డి (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబకుప్పం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దేవేంద్రరెడ్డి(51) సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పనులు చేస్తుండగా ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈయన మృతిపట్ల ఎంపీపీ అమరావతి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు సంతాపం తెలిపారు.

పీఆర్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీఆర్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను సోమవారం జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర బాబు, ప్రధానకార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షులు రాజేష్, అర్జునయ్య, చంద్రనాయక్, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శులు గణేష్‌బాబు, నవీన్ సాయి, ప్రదీప్ కుమార్, కోశాధికారి పృథ్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

మంగుంటలో నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం మంగుంట గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నూతన సీసీరోడ్డు ప్రారంభోత్సవానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ హాజరుకానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి గంధమనేని రాజశేఖర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాని విజయవంతం చేయాలన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, డీఆర్డీఏ పీడీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి తదితరులు

యాదమరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మురళీమోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య వెలుగు కార్యాలయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం 50 మందితో కూడిన సభ్యులకు కుట్టు, అల్లికలు, మగ్గం మిషన్ శిక్షణ 'సంకల్ప్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం సహకారం అందజేస్తుందన్నారు. మహిళల ఉపాధి కోసం త్వరలోనే గార్మెంట్స్ పరిశ్రమను మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్వయం సమృద్ధి సంపద సృష్టికి అందరూ సమిష్టిగా కృషిచేయాలని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్ఐ ఈశ్వర్, ఎంఈవో రుక్మిణి, ఏవో చరిత, టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ యాదవ్, నాయకులు హేమగిరి, అమర్‌నాథ నాయుడు, మాధవ, భజలింగం, చిత్ర, వేణు నాయుడు, గోపిగౌడ్, కుమార్, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంల ప్రమోషన్లలో జాప్యం


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ హంస కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల గ్రేడ్-3 ప్రమోషన్లకు సంబంధించి తీవ్ర జాప్యం జరుగుతోందని ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా, కార్యదర్శి టాటా బాయి, కోశాధికారి ఇమ్రాన్, తిరుపతి జాయింట్ సెక్రటరి జ్యోతిలక్ష్మి తదితరులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో హంస నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకుల వినతిపై కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ త్వరితగతిన జరిపేందుకు పరిశీలిస్తామని హామీయిచ్చారు. సవరణలు జరిపి తుది జాబితాను మంగళవారం మధ్యాహ్నం ఆన్‌లైన్‌లో పెడతామని, అభ్యంతరాలు లేకుంటే రెండ్రోజుల వ్యవధిలో ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి ఆర్డర్స్ ఇస్తామని తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో వసతులు సక్రమంగా లేవని ఫిర్యాదు చేయగా, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు కలెక్టర్ ఫోన్‌చేసి భవనాన్ని పరిశీలించి, మరమ్మతులకు ఎస్టిమేషన్లు ఇవ్వాలని ఆదేశించారు.

10 నుంచి ఎస్వీసెట్‌లో సెలెస్టా


ఎస్వీసెట్ సెలెస్టా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

పూతలపట్టు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్వీసెట్) కళాశాలలో ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో జాతీయ స్థాయి యువజనోత్సవం - సెలెస్టా 2కే25 నిర్వహించనున్నట్లు కళాశాల వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో సెలెస్టా పోస్టర్‌ను వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సాంస్కృతిక, క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తారన్నారు. 10వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విభిన్న పోటీలు, సాంస్కృతిక సంబరాలు, విశిష్ట ప్రదర్శనలు, ఫ్యాషన్, ప్రతిభ, సినీతారల ఆకర్షణలతో జరుగుతుందన్నారు.

- **9న అర్జున్ సన్నాఫ్ వైజయంతి ఆడియో లాంచ్**

కాగా ఈనెల 9వ తేదీన బుధవారం ఎస్వీసెట్ కళాశాలలో అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో కళ్యాణ్‌రామ్, ప్రముఖ నటి విజయశాంతి, సినీ ప్రముఖులు పాల్గొంటారన్నారు.

దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక నూతన కమిటీ ఏకగ్రీవం



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలికిరి జయరామయ్య చెప్పారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక చిత్తూరు జిల్లా కమిటీని కాణిపాకంలో ఎన్నుకున్నట్లు చెప్పారు. ఇందులో అధ్యక్షుడిగా లోకనాథం, ఉపాధ్యక్షుడిగా రాముడు, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా సరస్వతి, సహాయ కార్యదర్శిగా భాస్కర్ నాయుడు, కార్యవర్గ సభ్యులుగా బాలసుబ్రమణ్యం, సునందలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. దివ్యాంగులకు కావలసింది సానుభూతి, జాలి, దయాగుణం కాదని, తమ హక్కుల కోసం పోరాడుతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం


కొండ మల్లీశ్వరుడిని దర్శించుకుంటున్న కృష్ణమోహన్

వెదురుకుప్పం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం డీఆర్ఏన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు. ఏర్పాట్లను వ్యవస్థాపక ఆలయ ధర్మకర్త, ప్రవాసాంధ్రుడు డాక్టర్ ఎ.కృష్ణమోహన్ పర్యవేక్షించారు.

- వెదురుకుప్పం మండలం ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకత వల్లీ సమేత స్వయంభు సిద్దేశ్వర స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.
- వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామికి సోమవారం రుద్రాభిషేకం చేశారు. ఆ తర్వాత పూల అలంకరణ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



వెదురుకుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుపతికి చెందిన సురేష్‌బాబు కుటుంబీకులు వితరణ చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ చేతుల మీదుగా అన్నదానం చేశారు. ఆలయ ఉద్యోగులు, దాతలు హాజరయ్యారు.

నేడు వెదురుకుప్పంలో పీజీఆర్ఎస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ హాజరవుతారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు


శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సత్యసాయి బాల వికాస్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సీతారాములకు సత్యసాయి సేవాసమతి నిర్వాహకులు ప్రత్యేకపూజలు చేసి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమతి నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, పాండురంగం, భక్తులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 13 అర్జీలు


బాధితుల నుంచి అర్జీ తీసుకుంటున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి కమిషనర్ నరసింహప్రసాద్ అర్జీలను స్వీకరించారు. సమస్యలను పరిష్కరిస్తానని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పింఛన్ల కోసం 7, ఇంజనీరింగ్‌శాఖకు 4, రెవెన్యూకు 2 చొప్పున మొత్తం 13 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై కళాజాత

బంగారుపాళ్యం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మండలంలోని కొదలమడుగు ప్రభుత్వ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, చెత్తసేకరణ, ప్లాస్టిక్ నిషేధం, దోమల నివారణ, అంటువ్యాధుల గురించి విద్యార్థులకు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్బు, ఉపాధ్యాయులు రవీంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో ఎర్రజొన్నల పంపిణీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాయితీతో ఎర్రజొన్నలను పంపిణీ చేస్తామని వెదురుకుప్పం మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ సోమవారం తెలిపారు. రెండు వేల కేజీలు అందుబాటులో ఉన్నాయని, 75 శాతం రాయితీతో ఇస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఉన్న ఏఆర్టీ కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ రోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సహదేవ నాయుడు, అరుణ్ కుమారి, డీపీఎంవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించి మెరుగైన జీవన విధానాలను అవలంబించాలని పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కృష్ణమోహన్ కోరారు. పాలసముద్రం అరుణోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి బీసీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ గౌరి మజ్జిగ పంపిణీ చేశారు.

వెదురుకుప్పం: ఆరోగ్యకరమైన ప్రారంభం-ఆశాజనక భవిష్యత్తు అంటూ పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ యార్లపల్లి హేమశ్రీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ర్యాలీలో ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: ప్రజలు ఆరోగ్యంగా ఉన్నపుడే సమాజం సైతం ఆరోగ్యవంతంగా ఉండగలదని తూగుండ్రం పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక అన్నారు. తూగుండ్రం పురవీధుల్లో వైద్యసిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. పీహెచ్ఎన్ శాంతి, సూపర్‌వైజర్ క్రిష్ణమ్మ, ఎంపీహెచ్‌ఈవో రియాజ్, ఫార్మాసిస్ట్ రజియాసుల్తానా, హెల్త్‌అసిస్టెంట్ శంకర్‌రాజు, స్టాఫ్‌నర్స్ రాధ, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు సింగిల్‌విండో సొసైటీ ఆఫీస్ వద్ద డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు, మాత్రలు పంపిణీచేశారు. జిల్లా సహకారశాఖ అధికారిణి వనజ, సొసైటీ సీఈవో మురుగన్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి సి.ప్రసాద్, ఆడిటర్ రమణయ్య, విద్యాశాఖ అధికారి సుధాకర్, పలువురు వైద్య, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీహెచ్‌వో విజయ, బాల సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.